క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు కౌన్సిలర్ రాజీనామా


బెల్లి సత్తయ్య

చిట్యాల: మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బెల్లి సత్తయ్య బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వార్డు ప్రజలు, అనుచరులతో చర్చించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

వీఆర్‌ఏల వారసుల వినతి


వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏల వారసులు

నల్లగొండ టౌన్: విద్యార్హతను బట్టి 61 సంవత్సరాలు నిండిన వీఆర్‌ఏల వారసులను జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్లుగా నియమించి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ బుధవారం అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వీఆర్‌ఏల వారసులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మహమూద్, అంజి, వెంకటేశ్, షబ్బీర్, సయ్యద్, శ్రవణ్, సుధాకర్, ముత్తయ్య తదితరులు ఉన్నారు.

సిక్‌వాడీలో అన్నదానం


అన్నదానం చేస్తున్న కుల్‌దీప్‌సింగ్ బండారి

నల్లగొండ టౌన్ : గురుద్వాల్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక సిక్‌వాడీలో కుల్‌దీప్‌సింగ్ బండారి ఆధ్వర్యంలో గురుద్వార్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఎస్ బండారి, గురుమిత్‌సింగ్ బండారి, హరచరణ్‌కౌర్, దక్ష్‌మేష్‌కౌర్, మితిలేష్‌కౌర్, మణిచరణ్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న శేఖర్

చండూరు: మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన నిరుపేద చనగాని రవిగౌడ్(36) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు భీమనపల్లి శేఖర్, ప్రధాన కార్యదర్శి మొగుదాల శేఖర్, పందుల సత్యం, బెల్లంకొండ శేఖర్, మొగుదాల పెద్ద దశరథ, సరికొండ రమేష్, కమిటీ సభ్యులు పందుల వెంకన్నగౌడ్, మొగుదాల చిన్న దశరథ, అనంతల అశోక్, పాలకూర శీను, చనగాని శేఖర్, అనంతుల సత్యనారాయణ, బొమ్మగోని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జానారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


జానారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కేతేపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా కేతేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం మాజీ మంత్రి జానారెడ్డిని హైదరాబాద్‌లో కలిసి శాలువా కప్పి, బొకేలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, జటంగి సైదులు, వి.గురుస్వామి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి


డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న యరగండ్లపల్లి గ్రామస్తులు

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఆ గ్రామస్తులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ తారకరామన్‌ను కోరారు. యరగండ్లపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 724, 725లలో ప్రభుత్వం 9.30 ఎకరాలు కొనుగోలు చేసి 196 ప్లాట్లు చేసి 94 మంది నిరుపేదలకు పట్టాలు అందించింది. మిగిలిన ప్లాట్లు అలాగే ఉండిపోయాయి. వాటిలో పలువురు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి అర్హులకు న్యాయం చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

నత్తనడకన సమీకృత మార్కెట్ పనులు


నకిరేకల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న రెండు బ్లాక్‌ల పనులు


మొదలు కాని మూడో బ్లాక్ నిర్మాణం

- రూ.6.30 కోట్లతో నిర్మాణం
- నిధులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- మరో సంస్థకు అప్పగింత

నకిరేకల్: ప్రజలందరికీ ఒకేచోట మాంసం, చేపలు, కూరగాయలు, ఇతర సరుకులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నకిరేకల్ మున్సిపాలిటీలో నిర్మిస్తున్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఏడాదిన్నర కావొస్తున్నా పురోగతి కనిపించడం లేదు. 2021 జూన్ 15వ తేదీన సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

భూకంపాలను తట్టుకునేలా..

సుమారు 40 వేల పైచిలుకు జనాభా కలిగి ఉన్న నకిరేకల్ పట్టణంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ అవసరాలకు కోసం నిత్యం వస్తూనే ఉంటారు. కూరగాయల వ్యాపారాలతోపాటు, మాంసం, చేపల విక్రయాలు రోడ్ల మీదనే సాగుతుంటాయి. మున్సిపాలిటీలో వెజ్, నాన్‌వెజ్ ఒకేచోట లభించేలా గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మూసీ రోడ్డులో రూ.6.30 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో భూకంపాలు వచ్చినా పటిష్టంగా ఉండేలా లోతుగా తవ్వకాలు చేసి పనులు ప్రారంభించారు. సిమెంట్ కాంక్రీట్ బెడ్‌వేసి మార్కెట్ నిర్మాణం చేస్తున్నారు. ఈ మార్కెట్‌లో మొత్తం మూడు బ్లాక్‌లు నిర్మించాలి. గత అగ్రిమెంట్ ప్రకారం 48 షాపులు నిర్మించాల్సి ఉండగా తాజాగా మారిన అగ్రిమెంట్ ప్రకారం 68 షాపులకు పెరిగాయి. కాగా ఇప్పటివరకు రెండు బ్లాక్‌లకు మాత్రమే కేవలం స్లాబ్ లెవల్ వరకు నిర్మించి వదిలేశారు.

నిధులు రాకపోవడంతో..

నకిరేకల్ సమీకృత మార్కెట్ నిర్మాణం కోసం తొలి విడతలో స్టేట్ బడ్జెట్ కింద రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండో విడతలో మరో 4.30 కోట్లు మంజూరయ్యాయి. మార్కెట్ నిర్మాణం కోసం 2021 జూన్‌లో ఒక కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకుని పనులు చేపట్టారు. అయితే తొలి విడతలో మంజూరైన నిధులను గత ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రెండు బ్లాక్‌ల వరకు నిర్మించి వదిలేశారు. చేసిన పనులకు ఒక్క పైసా కూడా నిధులు రాక పనులు చేయలేనని సదరు కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో మున్సిపల్ అధికారులు 60/సీ జీఓ ప్రకారం నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపడుతున్న ఎస్‌కేఆర్ సంస్థకు సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అప్పగించారు. కాంట్రాక్ట్ అగ్రిమెంట్ ఇంకా పూర్తి కాలేదు. అధికారులు ఆదేశాల మేరకు నిర్మాణ స్థలాన్ని కాంట్రాక్ట్ సంస్థ తమ ఆధీనంలోకి తీసుకుంది. సమీకృత మార్కెట్‌ను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, రోడ్లపైన చిరువ్యాపారాలు చేసుకునేవారు కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలి



40 ఏళ్లుగా మూసీ రోడ్డులో చేపల మార్కెట్‌లోనే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ చేపల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాం. కొత్తగా సమీకృత మార్కెట్ నిర్మిస్తున్నారు. ఈ మార్కెట్ పనులు ప్రారంభించి ఏడాదిన్నర దాటింది. ఇంకా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంది. త్వరితగతిన మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేసి మా సమస్యలకు పరిష్కారం చూపాలి.

–గోగికార్ పూర్ణ, చేపల వ్యాపారి, నకిరేకల్

మరో సంస్థకు అప్పగించాం



నకిరేకల్‌లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ కోసం మొదట అగ్రిమెంట్ చేసుకున్న కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు పూర్తి చేయలేనని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నకిరేకల్‌లోనే మున్సిపల్ పనులు చేస్తున్న ఎస్‌కేఆర్ సంస్థకు సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అప్పగించాం. సైట్ వారికి అప్పగించాం. అగ్రిమెంట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అగ్రిమెంట్ ఆర్డర్ రాగానే పనులు వేగవంతం చేయిస్తాం.

–గౌతం, నకిరేకల్ మున్సిపల్ ఏఈ

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి


కేతేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి

కేతేపల్లి: ఓటరు జాబితా సవరణతోపాటు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్‌ఓలకు తహసీల్దారు ఎస్.మధుసూదన్ రెడ్డి సూచించారు. ఓటరు జాబితాపై బుధవారం కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన ఓటరు నమోదు, ఓటరు కార్డులో మార్పులు, చనిపోయిన ఓటర్లను గుర్తించి తొలగించడం, పోలింగ్ బూత్‌లలో సౌకర్యాల కల్పనపై మాస్టర్ ట్రెనీలు అవగాహన కల్పించారు. సమావేశంలో డీటీ దివ్య, ఆర్‌ఐ రాజేశ్వరి, మాస్టర్ ట్రెనర్ జి.కుశలవరెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి


మర్రిగూడ: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మర్రిగూడ: గ్రామాల్లోని నూతన ఓటర్లతోపాటు ప్రతి ఒక్కరికీ ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బీఎల్‌ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువ తెలిసే విధంగా గ్రామస్థాయిలో ప్రతి బీఎల్‌ఓ వివరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, ఆర్‌ఐ బషీర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెరుమాళ్ల వెంకటేశం

మర్రిగూడ: ఉపాధ్యాయుల సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంజేఆర్ బీఈడీ కళాశాలలో సంఘం జిల్లా కార్యదర్శి కాసిరెడ్డి కృష్ణారెడ్డి, గ్యార నరసింహ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశం మాట్లాడుతూ ఆగిపోయిన బదిలీలు, ప్రమోషన్లు, ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులతోపాటు పీఆర్‌సీ విడుదల చేయాలన్నారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పి.పరమేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎన్.శ్రీనివాస్‌రావు, పి.స్వప్న, కోశాధికారిగా బి.యాదయ్య, జిల్లా ప్రతినిధులుగా కె.జనార్దన్, పి.వాసుదేవరావు, డి.సుందరయ్య, బి.దీవంత, మీనాకుమారి, విజయలక్ష్మీ, ఉపేందర్, రామకృష్ణలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న టీఎన్‌జీఓ నాయకులు


కేక్ కట్ చేస్తున్న సిస్టర్స్, విద్యార్థులు


మహిళలను సన్మానిస్తున్న సంఘం సభ్యులు


నాటక ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డు పెజ్జోని బ్యూమింగ్ బడేస్ జ్యోతి నిలయ కాన్వెంట్ నర్సరీ స్కూల్లో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లెప్రసీ హెల్త్ సెంటర్ డైరెక్టర్ సిస్టర్ అంబిక ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ సందేశాన్ని అందించి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్లు పుష్ప, ఆరోగ్యమ్మ, లీమా, గోరేటి, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ పొలిటికల్ సెక్రటరీ పసల శౌరయ్య పాల్గొన్నారు.

ఉమెన్స్ క్రిస్మస్ వేడుకలు

నల్లగొండ పట్టణంలోని సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ బాప్టిస్ట్ చర్చిలో ఉమెన్స్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బాప్టిస్ట్ కన్వెన్షన్ ముఖ్య అతిథిగా రెవరెండ్ డాక్టర్ జాన్‌పాల్ పాటూరి హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం నల్లగొండ, వరంగల్, హనుమకొండ, సికింద్రాబాద్ మహిళలను ట్రెజరర్ శోభ మైఖేల్ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటికలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నవమని ఎలిజ, అన్నీ, శాంత ప్రసాద్, విమల ఎబినేజర్, దయానా విలియం కేరి, హెప్సిబా, షరా, దసిల్ల, ఎస్తేరు, ఎలిజబెత్, జెరుషారాణి, మనీ, పద్మారాణి, సుభాషిని, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో భవన్ లో..

నల్లగొండ టౌన్: స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో టీఎన్‌జీఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కాళిందిని, పీడీ రాజ్‌కుమార్, సీపీఓ బాలశౌరి పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేట్ అధ్యక్షుడు కే దయాకర్ రావు కోశాధికారి మేడి జయరావ్ జిల్లా ఉపాధ్యక్షుడు డి ఐ రాజు విద్యాశాఖ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్, టీఎస్‌టీఓ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవణ్‌కుమార్, కార్యదర్శి కాంచనపల్లి కిరణ్‌కుమార్, అధ్యక్షురాలు వెల్లంకి మాధవి రమ్యసుధ, డీఎంహెచ్ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, ఆకునూరు లక్ష్మయ్య, కత్తుల మనోజ్, ప్రదీప్, భిక్షం శంకర్, శ్రీనివాస్, సునీత, రఘువీర్ మహమ్మద్ అన్వర్, వహీద్, అశోక్ సుందర్, కరుణశ్రీ పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ మహోత్సవం


పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు, భక్తులు

రామగిరి (నల్లగొండ): పట్టణంలోని రవీంద్రనగర్‌లో జూలకంటి భీమార్జున్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు వెంకన్న, సురేష్, రాజు, మనోహర్, శేఖర్ గురు స్వాములు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కంజర శీను గురుస్వామి బృందం భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వాతి సువర్ణ మోక్షిత్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు చేయండి


మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు

చండూరు : క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఆర్డీఓ దామోదర్‌రావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే దుస్తుల పంపిణీ, క్రిస్మస్ విందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. క్రిస్టియన్ మత పెద్దల సమన్వయంతో లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, లావణ్య, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దారు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డికి ఘన నివాళి

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తనయుడు ప్రతీక్‌రెడ్డి 12వ వర్ధంతిని బుధవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించారు. మంత్రి నివాసంతోపాటు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రక్తదానం శిబిరం ఏర్పాటుచేశారు. కళాశాలలో నూతనంగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్‌ను ఎంజీయూ వైస్ ఛాన్సలర్ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ఎంవీ గోనారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, 30వ వార్డు కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు రక్తదానం చేశారు. 260 మందికి పైగా రక్తదానం చేశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మరియమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనాథాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి కోమటిరెడ్డి అల్లుడు ప్రణవ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్ది సుమన్, తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయినపల్లి కృష్ణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, తిప్పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూకూరి రమేష్, కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రాములు, కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, జూలకంటి శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, ఇంతియాజ్, సమీర్, బొజ్జ శంకర్, బాబా, బోగరి ఆనంద్, బుర్రి రజితయాదయ్య, ఇబ్రహీం, గడిగ హిమబిందు శ్రీనివాస్, చిన్నాల అలివేలుజానయ్య, ప్రదీప్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు ఇంతియాజ్, వంగాల అనిల్ రెడ్డి, హుస్సేన్, మందడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఇంతియాజ్, కంచి మధుసూదన్, బాబా, ఇటికాల శ్రీనివాస్, దుబ్బ అశోక్ సుందర్, జూలకంటి సైదిరెడ్డి, గాలి నాగరాజు, ఏదుళ్ల శ్రీధర్‌రెడ్డి, మామిడి కార్తీక్, గోలి రవి, పిల్లి రమేష్‌యాదవ్, ఇబ్రహీం, అఫ్జల్ ఖాన్, పున్న పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి సైకిల్ బహూకరణ

నల్లగొండలోని డైట్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 33 వార్డుకు చెందిన కొక్కు రఘుపతి కుమార్తెకు ప్రతీక్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వార్డు కౌన్సిలర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి సైకిల్ అందించారు. కార్యక్రమంలో రేగట్టె లింగస్వామి, ఊట్కూరి శేఖర్ రెడ్డి, లవకుమార్, యుగందర్‌రెడ్డి, నాగార్జున, విక్రం, కృష్ణ, కేపీ యాదవ్‌లు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

నల్లగొండ టౌన్: ప్రతీక్‌రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏర్పుల శ్రవణ్‌కుమార్, రిజ్వాన్, వెంకటేష్, శ్రీకాంత్, కళ్యాణ్, పర్వేజ్ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో..

నకిరేకల్: ప్రతీక్‌రెడ్డి 12వ వర్ధంతిని కాంగ్రెస్ నేత దైద రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం తాటికల్‌లో నిర్వహించారు. ప్రతీక్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటికల్‌లోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రియాజ్‌ఖాన్, బీరవోలు ఉపేందర్ రెడ్డి, రాజశేఖర్, నక్షత్, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నకిరేకల్‌లో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజన్‌యాదవ్ ఆధ్వర్యంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి వర్ధంతిని జరుపుకున్నారు.


ప్రతీక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోమటిరెడ్డి అల్లుడు ప్రణవ్‌రెడ్డి, తదితరులు


కోమటిరెడ్డి ప్రతీక్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ఎంజీయూ వీసీ, అధ్యాపకులు, ప్రొఫెసర్లు


రక్తదానం చేస్తున్న కౌన్సిలర్ మారగోని నవీన్‌కుమార్‌గౌడ్


రక్తదానం చేస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి


మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రణవ్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి


పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉచిత ప్రయాణ నిబంధనలు సవరించాలి


మర్రిగూడ : వినతిపత్రం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

చండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నిబంధనలు సవరించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు లింగయ్య ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉచిత ప్రయాణ ప్రభావం ఆటో కార్మికులపై పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కో కన్వీనర్ శంకర్, మండల కమిటీ సభ్యులు రాజేష్, సుమన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో..

మర్రిగూడ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ నిబంధనలు సవరించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్వై.గిరి మహారాజ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నెలకు రూ.లక్ష సంపాదించే మహిళలకు ఉచిత ప్రయాణాన్ని వర్తింపజేయకూడదన్నారు. పేద మహిళలకు మాత్రమే బస్సుల్లో ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. ఆటో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నందున వారికి నెలకు రూ.3 వేల ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, లక్ష్మణ్, జగన్, భిక్షం, గిరి, శివ తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలకు ఆదేశాలు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చేలా నెమలికాల్వ ఆనకట్ట నుంచి మూసీనదిలోకి నీటిని విడుదల చేసేందుకు నీటి పారుదల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ రామగిరికి చెందిన చామల వెంకటరమణారెడ్డి నీరుపారుదల శాఖ ఏఈ రాములుతో కలిసి నల్లగొండలోని ఇరిగేషన్ డివిజన్–7 ఈఈ సురేందర్‌రావును బుధవారం కోరారు. స్పందించిన ఈఈ వెంటనే చిట్యాల ఇరిగేషన్ సబ్‌డివిజన్ డీఈఈ, ఏఈలకు ఫోన్ చేసి నెమలికాల్వ ఆనకట్ట నుంచి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు.

పరిశ్రమ విస్తరణ నిలిపివేయాలని వినతి

చిట్యాల: వెలిమినేడు గ్రామ శివారులోని ఎంపీఎల్ ఐరన్ పరిశ్రమ విస్తరణ వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన దేశబోయిన నర్సింహ బుధవారం చిట్యాల డిప్యూటీ తహసీల్దార్ రాగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఐరన్ పరిశ్రమతో వాయు, జల కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.